సాక్షి
ప్రకాశం
మంగళవారం | 6 | జూన్ | 2023



ఎస్పీ స్పందనకు 101 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఎస్పీ స్పందన కార్యక్రమానికి 101 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. - 8లో..



హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
41 /31

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికం. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

సర్వజన ఆస్పత్రిలో బేబి ఫీడ్ సెంటర్ ఏర్పాటు



బేబి ఫీడ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ భగవాన్ నాయక్

ఒంగోలు అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో ఆస్పత్రికి వచ్చిన పసిపిల్ల తల్లులు తమ పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించి బేబీ ఫీడ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ ఆ కేంద్రాన్ని ప్రారంభించారు. పీడియాట్రిక్ ఓపీ విభాగం ఈ బేబి ఫీడ్‌సెంటర్‌ను ఏర్పాటు చేసి తల్లులు పిల్లలకు పాలు ఇచ్చేలా మౌలిక సౌకర్యాలు కల్పించారు. దీనిలో పీడియాట్రిక్ హెచ్‌ఓడీ ఎలిజిబెత్, ఇతర డాక్టర్‌లు శివరామకృష్ణ, శ్రీనివాస్, రమాదేవి, రవీంద్ర, రవితేజ, పద్మావతి పాల్గొన్నారు.

సత్తాచాటిన గుంటూరు జిల్లా ఎడ్లు



బండ లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో లక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్ర స్థాయి బండ పందెం నిర్వహించారు. గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్యచౌదరి, సంతమాగులూరుకు చెందిన జీ వీరమ్మ ఎడ్లు 4500 అడుగులతో మొదటి స్థానంలో నిలిచాయి. అర్ధవీడు మండలం గన్నెపల్లెకు చెందిన దూదేకుల ఖాశీంవలి ఎడ్లు 3900 అడుగులతో ద్వితీయ, వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలం చెన్నారెడ్డిపల్లికి చెందిన వై జనార్దన్, సీఎస్‌పురం మండలం చెర్లోపల్లికి చెందిన కే వెంకటరాజుల ఎడ్లు 3900 అడుగులతో తృతీయ, నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన ఈ వెంకటేశ్వర్లు, బేస్తవారిపేట మండలం గలిజేరుగుళ్లకు చెందిన అన్నెం రంగారెడ్డి ఎడ్లు 3514 అడుగులతో నాల్గోవ, కంభం మండలం లింగోజిపల్లెకు చెందిన భూపని ఎల్లయ్య ఎడ్లు 3452 అడుగులతో ఐదో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో, నాల్గోవ, ఐదోవ బహుమతులు వరుసగా రూ.20 వేలు, రూ.12,500, రూ.12,500, రూ.8 వేలు, రూ.5 వేలను దాతలు అందజేశారు.

చిన్న పిల్లల మరణాలు నివారించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్




ఐడీసీ యాప్ కార్యక్రమాలపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లల మరణాలను నివారించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం స్పందన భవనంలో ఐడీసీ యాప్‌కు సంబంధించి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అన్నీ ప్రభుత్వ వైద్యశాలల్లో జింక్, ఓఆర్ఎస్ అందేలా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆశా, ఏఎన్ఎంల ద్వారా జింక్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాల్లో వ్యాధి నిరోధక టీకాల కేంద్రం ఏర్పాటు చేయాలని, చేతులు శుభ్రపరుచుకునే పద్ధతులతో పాటు ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసుకునే పద్ధతిని ప్రజలకు తెలియచేయాలన్నారు. అతిసార వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు తప్పనిసరిగా 14 రోజుల పాటు జింక్ మాత్రలు అందచేయాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆంగ్ల పరీక్షకు 226 మంది గైర్హాజరు

ఒంగోలు: పదో తరగతి అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో భాగంగా సోమవారం ఆంగ్ల పరీక్ష జరిగింది. జిల్లాలోని 44 పరీక్ష కేంద్రాల్లో ఆంగ్ల పరీక్షకు 207 మంది హాజరుకావాల్సి ఉండగా కేవలం 281 మంది మాత్రమే హాజరయ్యారు. 9 పరీక్ష కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారని, పరీక్షలు పూర్తి ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు.



మరుగుదొడ్ల నిర్మాణంలో పాల్పడిన అవినీతిపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన ర్యాలీని భగ్నం చేసేందుకు, తన అక్రమాల అంశం మరుగున పడిపోయేలా కొండపి ఎమ్మెల్యే, టీడీపీ నేత డోలబాల వీరాంజనేయస్వామి సోమవారం హైడ్రామాకు తెరతీశారు. అయితే ఆయన వ్యూహానికి నియోజకవర్గంలోని కేడర్ నుంచి అనుకున్నంత స్పందన రాలేదు. అప్పటికప్పుడు జాతీయ రహదారిపై ధర్నా చేయాలని ప్లాన్ మార్చేశారు. దానిని పోలీసులు భగ్నం చేయడంతో ఆయన భంగపడక తప్పలేదు. పచ్చమీడియా మాత్రం హంగామా చేసింది.

డోలా..డీలా

- రక్తి కట్టని పోటీ ఆందోళనలు
- అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే స్వామి తంటాలు
- సొంత పార్టీ నుంచే స్పందన కరువు
- శాంతిభద్రతలకు సమస్య తలెత్తేలా హైడ్రామా
- చిరిగిన చొక్కాతో ఫొటోలకు ఫోజులు
- హడావిడి చేసిన పచ్చమీడియా

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొండపి నియోజకవర్గానికి కేటాయించిన మరుగుదొడ్లలో 60 శాతం మేర నిర్మించకుండా దొంగబిల్లులు చేసుకుని ఎమ్మెల్యే డోలాబాల వీరాంజనేయస్వామి, కొందరు టీడీపీ నాయకులు రూ.22.5 కోట్ల మేర స్వాహా చేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఎప్పటి నుంచో ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. గతంలో ఈ అంశంపై టంగుటూరులో ఆయన ప్రజా దర్బార్ కూడా నిర్వహించారు. ఈ క్రమంలో సోమవారం తూర్పునాయుడు పాలెంలోని ఎమ్మెల్యే ఇంటిని శాంతియుతంగా ముట్టడించాలని వరికూటి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు టంగుటూరుకు తరలి రావాలని, అక్కడ నుంచి చెంబులతో నిరసన ర్యాలీ చేసి ఇళ్లు ముట్టడిస్తామని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ కార్యక్రమం విజయవంతమైతే తన అవినీతి ఎక్కడ బట్టబయలు అవుతుందోనన్న భయంతో ధర్నా పేరుతో నాటకానికి తెరతీశారు.

స్పందించని టీడీపీ కేడర్..

మరుగుదొడ్ల స్కాంను కప్పిపుచ్చేందుకు వైఎస్సార్‌సీపీకి పోటీగా టీడీపీ కార్యకర్తలతో చలో టంగుటూరు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే స్వామి చేపట్టారు.నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణులను తన ఇంటికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. కానీ ఆశించిన స్థాయిలో కార్యకర్తలు, నాయకులు తూర్పునాయుడుపాలెం చేరుకోలేదు. దీంతో కొంత అసహనానికి గురైన ఎమ్మెల్యే స్వామి నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక చేసేదేమీ లేక ఎమ్మెల్యే స్వామి ఉన్న కార్యకర్తలతో జాతీయ రహదారిపై ధర్నా అంటూ హడావుడి చేశారు.

నాడు దోపిడీ ... నేడు నానా యాగి ...

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19లో నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ పేరుతో మరుగు దొడ్డి లేని పేదలకు ఎన్ఆర్‌జీఎస్ నిధులతో రూ.15 వేలు అందిస్తుందని ప్రకటించారు. నియోజకవర్గానికి సుమారు 25 వేల ఇళ్లు మంజూరయ్యాయి. అందుకు రూ.40 కోట్లు కూడా విడుదలయ్యాయి. సుమారు 15000 మరుగుదొడ్లు నిర్మించకుండా రూ.22.50 కోట్లు స్వాహా చేశారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతో జన్మభూమి కమిటీలు, కొందరు నాయకులు మరుగుదొడ్లు నిర్మించకుండానే, నిర్మించినట్లు ఉపాధి హామీ పనిచేసే పేద ప్రజల వేలి ముద్రలు తీసుకుని నిధులు మింగేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు ఆరోపిస్తూ వస్తున్నారు. ఈ విషయంపై అశోక్‌బాబు 8 నెలలుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే, టీడీపీ నేతల అవినీతిని ఆయన సాక్ష్యాలతో బయటపెట్టారు. పేదలకు డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఇన్నాళ్లూ మన్ను తిన్న పాములాగా మిన్నకుండిపోయిన స్వామి తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు నేడు అశోక్‌బాబుపై పలు ఆరోపణలు చేశారు. ఆయన అవినీతిపరుడని, ఇసుక మాఫియా రెచ్చిపోతోందని ఆరోపణలు చేశారు. తన బండారాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన చెంబుల ర్యాలీకి పోటీ కార్యక్రమానికి తెరతీశారు. పార్టీ కేడర్ స్పందించకపోవడంతో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తేలా జాతీయ రహదారిపై వాహనాలు నిలిపివేయడం, పోలీసులపైకి కేడర్‌ను ఉసిగొల్పడం వచ్చి చర్యలకు దిగారు. శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు ముందుగానే ఎమ్మెల్యే స్వామిని గృహనిర్బంధం చేశారు. వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జాతీయ రహదారిపై ధర్నా చేయబోయారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేని, కార్యకర్తలను సీఐ వీరాంజనేయులు నిలువరించే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే చర్యలతో రెచ్చిపోయిన కార్యకర్తలు కొందరు పోలీసులపై దాడి చేశారు.



పోలీసు వాహనంలో ఎమ్మెల్యే డోలా

చిరిగిన చొక్కాతో ఫొటోలకు ఫోజులు

నిరసన కార్యక్రమాన్ని నిలిపివేయటానికి స్వామిని పోలీసు వాహనంలో ఇంటికి తరలించే క్రమంలో టీడీపీ కార్యకర్తలు పోలీసులపై దాడికి యత్నించారు. స్వామిని వాహనం ఎక్కకుండా గట్టిగా పట్టుకోవటంతో ఆయన చొక్కా చిరిగిపోయింది. అయితే ఆ ప్రాంతంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎవరూ లేకపోయినా, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు దాడి చేయటం వలనే తన చొక్కా చిరిగినట్లు మీడియా ముందుకు వచ్చి స్వామి హడావుడి చేశారు. దీనికి పచ్చమీడియా సైతం విస్తృత ప్రచారానికి తెరతీసింది. అయితే సొంత పార్టీ నేతల నుంచి పూర్తి స్థాయిలో స్పందన రాకపోవడంతో డోలాకు భంగపాటు తప్పలేదు.

మరుగుదొడ్ల నిధులు కాజేయడం అమానుషం



టంగుటూరు బొమ్మల సెంటర్‌లో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

- వైఎస్సార్‌సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- ఎమ్మెల్యే స్వామి మరుగుదొడ్ల అవినీతిపై చెంబులతో నిరసన
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- టీడీపీ ఎమ్మెల్యే స్వామి ఇంటి ముట్టడికి యత్నం
- ఉద్రిక్తతల మధ్య అశోక్‌బాబును అడ్డుకున్న పోలీసులు

టంగుటూరు: కొండపి నియోజకవర్గంలో పేదలకు మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణంలో టీడీపీ ఎమ్మెల్యే డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి అవినీతి అక్రమాలకు పాల్పడి ప్రజల సొమ్మును కాజేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో పేదల మరుగుదొడ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలకు నిరసనగా అశోక్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు చెంబులతో నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. టంగుటూరు బొమ్మల సెంటర్‌లో అశోక్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణంలో ఎమ్మెల్యే స్వామి భారీ అవినీతికి పాల్పడి మరుగుదొడ్లు నిర్మించకుండా తనతో పాటు గ్రామాల్లోని టీడీపీ నాయకుల జేబులు నింపుకున్నారన్నారు. స్వచ్ఛ భారత్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మరుగుదొడ్డి లేని ప్రతి కుటుంబానికి రూ.15 వేలతో మరుగుదొడ్డి నిర్మించాలని పూనుకుందన్నారు. అయితే కొండపి నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్వామి, టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు ఏ గ్రామంలో కూడా మరుగుదొడ్లు నిర్మించకుండా స్వచ్ఛంద సంస్థల పేరుతో సుమారు రూ.22.5 కోట్ల నిధులను దోచేశారన్నారు. వీరి అవినీతి బాగోతం వలన నియోజకవర్గంలో 15 వేల పేద కుటుంబాల వారు మరుగుదొడ్ల నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ఎనిమిది నెలలుగా మరుగుదొడ్ల అవినీతిపై చర్చకి సిద్ధమా అని ఎమ్మెల్యే స్వామికి సవాల్ విసురుతుంటే చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. స్వామి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో విసుగు చెందిన బాధితులు చెంబులతో వినూత్న నిరసన చేపట్టి ఆయన ఇంటి ముట్టడికి శ్రీకారం చుట్టారన్నారు. దీనికి భయపడిన ఎమ్మెల్యే స్వామి అక్రమాలు కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ కార్యకర్తలతో చలో టంగుటూరు కార్యక్రమం చేపట్టగా అనుకున్న స్థాయిలో కార్యకర్తలు హాజరు కాకపోవడంతో విఫలయత్నం చేశారని ఎద్దేవా చేశారు. అలాగే పొలం లేని వారిని రైతులుగా చూపెట్టి వారి పేరున నీటి కుంటలు తవ్వినట్లు చూపించి లక్షల రూపాయలు దోచుకున్నారన్నారు. దోచుకున్న మరుగుదొడ్ల డబ్బులను తిరిగి బాధితులకు ఇవ్వకపోతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. అలాగే మరుగుదొడ్ల అవినీతి పరులపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. అనంతరం చెంబులతో నిరసన ర్యాలీ చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎమ్మెల్యే స్వామి ఇంటి ముట్టడికి ప్రయత్నించగా ర్యాలీగా వెళ్తున్న అశోక్‌బాబుని పోలీసులు అడ్డుకొని ఇంటికి తరలించారు. ఈ సమయంలో కొంత ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి, గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి, పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, మర్రిపూడి నుంచి దద్దాల మల్లిఖార్జున, బొగసముద్రం విజయభాస్కరరెడ్డి, వాకా బాలకృష్ణారెడ్డి, నల్లూరి సురేంద్ర, ఆరు మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి ఉండాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులో క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిరోజు కొంత సమయం కేటాయించాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ట్రైనీ ఐఏఎస్ అధికారి శౌర్య పటేల్, డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు లోకేశ్వరరావు, చెన్నయ్య ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- మార్కాపురం మండలం పెద్దనాగులవరం గ్రామానికి చెందిన వెంకట రామిరెడ్డి దోర్నాల తహశీల్దార్ సర్వే నంబర్ 160లోని తన పట్టా భూమిని అక్రమంగా వెబ్‌ల్యాండ్‌లో చేర్చారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. మార్కాపురం సబ్‌కలెక్టర్‌ను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.
- కనిగిరి మండలం పునుగోడు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తనకు జాబ్ కార్డు ఉన్నా ఉపాధి పనులకు రానివ్వడం లేదని ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ పరిశీలించి పరిష్కరించాలని డ్వామా పీడీని ఆదేశించారు.
- కొండపికి చెందిన షేక్ ఖాసీం స్పందనలో అధికారులను కలిసి కొండపిలో పొదిలి రోడ్డులోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్నానని టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగించే తనకు ప్రమాదంలో మోకాలు వరకు కాలు పోయిందని తెలిపాడు. తనకు నివేశన స్థలం అందచేసి గృహ నిర్మాణం చేసి ఇవ్వాలని కోరుతూ అర్జీ అందజేశాడు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలి
- ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నివారించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతి వాతావరణం అందించాలంటే పర్యావరణాన్ని పరిరక్షించాలని అది అందరం కలికట్టుగా బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రకాశం భవనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తొలుత పరిసరాల్లో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం ఎవరికి వారు స్వచ్ఛందంగా మానుకుని జూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని ప్రారంభించారు. దీనిలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డీపీఓ నారాయణరెడ్డి, సచివాలయాల ఇన్‌చార్జ్ ఉషారాణి, డాక్టర్‌లు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, ఆశాలు పాల్గొన్నారు.

- ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగమూరు రోడ్డులో ఏర్పాటు చేసిన గ్రీన్ ర్యాలీని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, నగర మేయర్ గంగాడ సుజాత జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా గుడ్డ, జూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. దీనిలో ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగులు పాల్గొన్నారు.
- వాలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ చైర్మన్ జీ వీరభద్రాచారి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సదర్భంగా సీవీఎన్ రీడింగ్ రూము నుంచి కలెక్టరేట్ వరకు గ్రీన్ వాక్ నిర్వహించారు. భవిష్యత్తు తరాలకు కాలుష్యం లేని మంచి వాతావరణం అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు. దీనిలో మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఫుట్‌బాల్ ఆడుతున్న సీనియర్ ఆటగాళ్లు

కురిచేడు: జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ఎస్సై యం.దేవకుమార్ ప్రారంభించారు. టాస్ వేసి ఆటగాళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి అన్నారు. వివాదాలకు తావివ్వకుండా స్నేహపూర్వక వాతావరణంలో ఆడుకోవాలని ఎస్సై దేవకుమార్ సూచించారు. ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో 2 జట్లు, సీనియర్ విభాగంలో 8 జట్లు పోటీపడుతున్నట్లు నిర్వాహకుడు కంభంపాటి రాజా తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలను, టీషర్టులు, షీల్డ్‌లు దేవతి నాగేంద్రకుమార్ అందజేశారు. ద్వితీయ బహుమతి రూ.10 వేలను జానపాటి పవన్, తృతీయ బహుమతి రూ.5 వేలను కంభంపాటి సాయన్న అందజేశారు.

12న మెగా సీడ్ మేళా



మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాప్రసాద్

దర్శి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో ఈ నెల 12వ తేదీ మెగా సీడ్ మేళా నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక కృషివిజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేళాలో వివిధ రకాల పంటలకు సంబంధించిన మేలు రకాల విత్తనాలు ప్రదర్శించడంతో పాటు విక్రయాలు కూడా చేపడతారని తెలిపారు. వరిలో ఎంటీయూ-1224, 1262 వంటి మార్టేరు రకాలు, బీపీటీ-5204, 2295, 2595, 2511, 2046, 2841 వంటి బాపట్ల రకాలు, చౌడును తట్టుకునే ఎంసీఎం-125 వంటి మచిలీపట్నం రకాలు, ఎన్ఎల్ఆర్-3449 వంటి నెల్లూరు రకాలు అమ్మకానికి లభిస్తాయని చెప్పారు. మినుములో ఏబీజీ-884, టీబీజీ-104, 129, పెసరలో ఐపీఎం-2-14, ఎల్‌జీజీ-460, 604 రకాలు, శనగలో ఎన్‌బీసీజీ-452, 119, 776, 49 వంటి రకాలు, వేరుశనగలో కదిరి, లేపాక్షి, ధరణి, నిత్య హిత, కదిరి-6 రకాలు, నువ్వులో వైఎల్ఎం-66 రకం, రాగిలో వకుళ, వేగావతి, ఇంద్రావతి, రకాలు, కొర్రలో ఎస్ఏ-3156, రేనాడు రకాలు, జొన్నలో ఎన్‌టీజే-5 వంటి రకాలు లభ్యమవుతాయని తెలిపారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2,99,311

సీఎస్‌పురం(పీసీపల్లి): మండల పరిధిలోని మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం రూ.2,99,311 ఆదాయం వచ్చినట్లు ఈఓ ఎస్ నారాయణ రెడ్డి తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.1,12,760, లడ్డు ప్రసాద విక్రయాల ద్వారా రూ.40,970, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,02, 833, మహా ప్రాకార నిర్మాణానికి రూ.15116, ఇతర విరాళాల ద్వారా రూ. 27632 వచ్చినట్లు ఈఓ తెలిపారు.

రాష్ట్ర స్థాయి జూనియర్ ఎడ్ల పోలురాధా పోటీలు

అల్లూరు (కొత్తపట్నం): ఈ నెల 10 నుంచి జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోలురాధా పోటీలు నిర్వహించనున్నట్లు అల్లూరు గ్రామ ఎడ్ల కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలు డ్రా పద్ధతిలో నిర్వహిస్తారన్నారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో రూ.18 వేలు, నాల్గోవ రూ.15 వేలు, ఐదోవ రూ.12 వేలు, ఆరోవ రూ.10 వేలు, ఏడోవ రూ.7 వేలు, ఎనిమిదో 5 వేలు, తొమ్మిదోవ రూ.3 వేలు, పదో బహుమతి రూ.2 వేలు ప్రదానం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 9951288627, 9100630280 ఆసక్తి ఉన్న పశుపోషక రైతులు పై నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

అన్నా పథకాలన్నీ వస్తున్నాయా..

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- ఉత్సాహంగా సాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: అన్నా బాగున్నావా.. పింఛను వస్తుందా తాతా.. మీ ఇంట్లో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వస్తున్నాయా.. అక్కా ఆసరా పథకం డబ్బులు అకౌంట్లో పడ్డాయా? అంటూ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోమవారం పట్టణంలోని 6వ వార్డు ఎస్సీ బీసీ కాలనీ వాసులను ఆప్యాయంగా పలకరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వార్డు ప్రజలతో ముచ్చటించారు. వార్డు ఇన్చార్జి ఉత్తమ్ కుమార్, కౌన్సిలర్ దేవకరుణమ్మ ఎమ్మెల్యే కేపీ, ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డిని సత్కరించి గడప గడపకు తిరిగారు. వార్డులోని ప్రజలు ఎమ్మెల్యేపై పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకాలు వస్తున్నాయన్నారు. అర్హత ఉండి పథకాలు రానివారు సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు దొడ్డా భాగ్యలక్ష్మి, కొత్త కృష్ణా, హర్షిత బాబి, నాగఅరుణ, వై.రంగలక్ష్మమ్మ, రోజ్ లీడియా, కరీంబాషా, కరీముల్లా, ప్రచార కార్యదర్శి మయూరి కాశీం, అడ్వకేట్ రవీంద్ర, పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు బాలసుబ్బారావు, చాంద్ బాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి

● గుండమాల తీరంలో మృతదేహం లభ్యం


గుండమాల తీరంలో కార్తీక్ మృతదేహం

కొత్తపట్నం: కొత్తపట్నం బీచ్‌లో ఆదివారం సముద్ర స్నానం చేస్తుండగా అలల తాకిడికి గల్లంతైన యువకుడు మృత్యువాత పడ్డాడు. అతని మృతదేహం సోమవారం గుండమాల సముద్ర తీరానికి కొట్టుకొచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కొక్కిలగడ్డ జితేంద్రసాయి, అవనిగడ్డ కార్తీక్(20) అనే యువకులు సముద్ర తీరంలో అలల ధాటికి కొట్టుకుపోతుండగా స్థానిక మత్స్యకారుడు పెద్దసింగు సురేంద్ర గమనించి కాపాడే ప్రయత్నం చేశారు. జితేంద్రసాయిని ఒడ్డుకు చేర్చి 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందిన విషయం తెలిసిందే. సింగరాయకొండకు చెందిన అవనిగడ్డ కార్తీక్(20) మాత్రం అలల ధాటికి కొట్టుకుపోయాడు. సోమవారం గుండమాల తీరంలో మృతదేహం బయటపడటంతో ఎస్సై సాంబశివరావు వెళ్లి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి


ఏరువాక సందర్భంగా పొలం దున్నుతున్న పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు


మొక్కలు నాటుతున్న ఈడీ

ఒంగోలు రూరల్: మండలంలోని పొగాకు వేలం కేంద్రం–2లో ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతు పూజోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు పాల్గొని మాట్లాడారు. ఏరువాక పౌర్ణమిని ప్రాచీన రుగ్వేదం నుంచి రైతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. వ్యవసాయం ఒక యజ్ఞమని, భూమిని, గోమాతను, ప్రకృతిని పూజించడం మన సంప్రదాయమని అన్నారు. అంతా మంచే జరగాలని, ఈ సంవత్సరం ఎంతో సంతోషకరంగా ఉంటుందని ఆకాంక్షించారు. రైతులకు మంచి ధరలు లభించినందుకు ఆనందంగా ఉందని తెలిపారు. రైతులకు వస్తున్న మార్కెట్ ధరలు చూసి బ్యారన్ ధర, పొలం కౌలు పెంచుకోవద్దన్నారు. శ్రీధర్‌బాబు స్వయంగా పొలం దున్ని ఏరువాకను ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఒంగోలు డివిజన్ అధికారులు ఎం.లక్ష్మయ్య, దామోదర్, వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ, పొగాకు బోర్డు మెంబర్లు మారెడ్డి సుబ్బారెడ్డి, వరప్రసాద్, బొడపాటి లక్ష్మయ్య, వడ్లెళ్ల ప్రసాద్, వై.వి.శేషయ్య, వ్యాపార సంస్థల ప్రతినిధులు, రైతు ప్రతినిధులు, రైతులు, వేలం కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 101 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

● బాధితులకు భరోసా ఇచ్చిన ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 101 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను విన్న ఎస్పీ వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- ఒంగోలు నగరంలోని ఇస్లాంపేటకు చెందిన హబీబా అనే మహిళ తన వద్ద చీటీపాట పేరుతో 5 లక్షల రుపాయలు కట్టించుకుని డబ్బు ఇవ్వకుండా బెదిరిస్తోందని గోపాల్‌నగర్‌కు చెందిన ఒక మహిళ ఎస్పీ ఎదుట గోడు వెళ్లబోసుకుంది.
- తన ఇన్నోవా కారును అవసరం ఉందని తీసుకెళ్లిన బంధువులు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు తిరిగి ఇవ్వలేదని యర్రగొండపాలేనికి చెందిన షేక్ అబ్దుల్ ఫిర్యాదు చేశారు.
- అదనపు కట్నం కోసం తన భర్త, అతడి కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ఒంగోలు ఏకలవ్యనగర్‌కు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

జూదంపై పోలీసుల కొరడా

● 38 పేకాట స్థావరాలపై దాడి.. 194 మంది అరెస్టు
● రూ.1.99 లక్షల నగదు స్వాధీనం


టంగుటూరు పోలీసుల అదుపులో జూదరులు

ఒంగోలు టౌన్: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. 38 ప్రదేశాల్లో పేకాట ఆడుతున్న 194 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.1,99,020 నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక ఎన్ఫోర్స్‌మెంట్‌లో భాగంగా పేకాట శిబిరాలపై డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. జూద క్రీడలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకన్ డ్రైవ్, స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు సాగుతుంటే డయల్ 112కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

పోలీస్ వాట్సప్ నం.9121102266కు మెసేజ్ ద్వారా కూడా సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. కాగా మే నెలలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 4,064 మందిపై కేసులు నమోదు చేసి 4205 మందిని అరెస్టు చేశామని, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 898 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోద చేశామని ఎస్పీ వెల్లడించారు.

హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

● మే 27వ తేదీ రాత్రి తండ్రీకొడుకులపై దాడి
● నలుగురు నిందితులకు రిమాండ్
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామరాజు


వివరాలు వెల్లడిస్తున్న కనిగిరి డీఎస్పీ రామరాజు

కొండపి: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ పి.రామరాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. పెదకండ్లగుంట గ్రామంలో చెరుకూరి సురేష్ కుటుంబానికి, వారి బంధువులకు ఎరువు దిబ్బలు పోసుకునే స్థలం విషయంలో గొడవలు జరిగాయి. ఇరువర్గాలపై కొండపి స్టేషన్‌లో కేసులు నమోదు కావడంతో కోర్టుకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో చెరుకూరి సురేష్‌ను అంతమొందించాలని భావించిన బోయిపాటి నరసింహారావు తన బంధువైన దేవినేని వేణు, అంకమ్మరావు, పూర్ణచంద్రరావుతో కలిసి పథకం రచించారు. గత నెల 27తేదీ రాత్రి నలుగురు నిందితులు జాళ్లపాలెం రోడ్‌లో కోళ్లఫారం వద్ద మాటువేసి సురేష్‌ను ఆయన తండ్రి నర్సింహారావును జామాయిల్ కర్రలతో కొట్టారు. తండ్రీకొడుకులు చనిపోయారనుకుని భావించి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన తండ్రీకొడుకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. టంగుటూరు–కొండపి రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు బైక్‌లపై వస్తున్న నలుగురు వ్యక్తులు వాహనాలు వదిలేసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసు సిబ్బంది వారిని పట్టుకుని మధ్యవర్తుల సమక్షంలో విచారించగా వారు గత నెల 27వ రాత్రి కొండపి పెదకండ్లగుంట రోడ్‌లో హత్యాయత్నానికి పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. స్వల్ప వ్యవధిలో కేసును ఛేదించిన కొండపి సీఐ వై.పాండురంగారావు, ఎస్సై వైవీ రమణయ్య, ఏఎస్సై జిలానీబాషా, హెడ్‌కానిస్టేబుల్ బి.రమేష్, కానిస్టేబుళ్లు అనిల్‌బాబు, రవిని డీఎస్పీ అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన రవాణాశాఖ ఉప కమిషనర్


డీటీసీ సుశీలకు పూలమొక్క అందిస్తున్న ఎంవీఐ కిరణ్ ప్రభాకర్

ఒంగోలు: జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్‌గా రాయడు సుశీల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న నెల్లూరు జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ బి.చందర్ ఆమె బాధ్యతలు అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారులు, సిబ్బందితో ఉప కమిషనర్ మాట్లాడుతూ.. తనకు జిల్లాలో వివిధ పోస్టుల్లో పని చేసిన అనుభవం ఉందని చెప్పారు. పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా కృషి చేద్దామన్నారు. కాగా రెండున్నర నెలలపాటు తనకు సహకరించిన అధికారులు, సిబ్బందిని నెల్లూరు డీటీసీ చందర్ అభినందించారు. అనంతరం మార్కాపురం ఆర్టీఓ అమర్‌నాయక్, ఎంవీఐ కిరణ్‌ప్రభాకర్, జగదీష్, రామచంద్రరావు, ఏఓ శ్రీనివాస్ తదితరులు డీటీసీ సుశీలకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

నర్సింగ్ విద్యార్థినితో హెడ్‌కానిస్టేబుల్ అసభ్య ప్రవర్తన

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ ఓ నర్సింగ్ విద్యార్థినిని ముద్దు పెట్టుకోవడం సంచలనం సృష్టించింది. ఈ మేరకు తాలుకా పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. వివరాలు.. ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కోటిరెడ్డి ఆదివారం రాత్రి స్టేషన్ ఇన్‌చార్జిగా డ్యూటీలో ఉన్నారు. కిమ్స్ హాస్పిటల్‌లో ఎంఎల్‌సీ కేసుకు సంబంధించి స్టేట్‌మెంట్ రికార్డు చేయడానికి ఆయన రాత్రి 1.30 సమయంలో కిమ్స్ వైద్యశాలకు వెళ్లారు. క్యాజువాలిటీ నుంచి పైఅంతస్తుకు వెళ్తున్న సమయంలో నర్సింగ్ విద్యార్థిని ఒకరు లిఫ్ట్ ఎక్కారు. ఒంటరిగా ఉన్న ఆ విద్యార్థినితో హెచ్‌సీ అసభ్యంగా ప్రవర్తించి, బలవంతంగా ఆమె బుగ్గలపై ముద్దు పెట్టుకున్నారు. ఆ విద్యార్థిని సోమవారం ఎస్పీ మలికా గర్గ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధవరం పొలాల్లో గుర్తుతెలియని మృతదేహం

కొనకనమిట్ల: కొనకమిట్ల మండలం సిద్ధవరం సమీపంలోని పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం సోమవారం వెలుగుచూసింది. ఎస్సై కడలి దీపిక కథనం మేరకు.. సిద్ధవరం గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలోని పొలాల్లో చెట్ల మధ్య కుళ్లిన స్థితిలో ఉంది. స్థానికుల ద్వారా సమాచారం తెలియడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లపైనే ఉంటుందని, మృతుడి శరీరంపై తెల్లని గడ్డం, బట్టతల, తెల్లని చొక్కా, పంచ ఉన్నాయని చెప్పారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉందని తెలిపారు. మృతదేహం సంఘటనా స్థలంలోనే ఉందని, ఎవరైనా గుర్తు పడితే 9121102174ను సంప్రదించాలని కోరారు.

రైల్వే డాక్టర్ ఇంట్లో చోరీ


దొంగలు పగలగొట్టిన బీరువా

ఒంగోలు టౌన్: నగరంలోని భాగ్యనగర్లో నివసిస్తున్న రైల్వే వైద్యుడి ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలుపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. రైల్వే హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఇమ్మనేని వెంకట రమణారావు భాగ్యనగర్‌లోని నాలుగో లైనులో నివాసం ఉంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మాలకొండ, భైరవకోన వెళ్లి దైవదర్శనం అనంతరం అర్ధరాత్రి ఒంటి గంటకు ఇంటికి చేరుకున్నారు. తలుపులు ధ్వంసమై ఉండటంతో చోరీ జరిగిందని గ్రహించారు. బీరువాలో దాచి ఉంచిన రూ.7.35 లక్షల విలువైన బంగారు నగలు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు అత్యధిక ధర కేజీ రూ.209


టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

కొండపి/టంగుటూరు: కొండపి పొగాకు వేలం కేంద్రంలో అత్యధిక ధర కేజీ రూ.209గా నమోదైంది. ఒంగోలు రీజియన్‌లో ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధర కావడం విశేషం. కొండపి కేంద్రానికి సోమవారం మర్రిపూడి మండలం అయ్యపురాజుపాలెం, నర్సరాజుపాలెం, కొండపి మండలం పెదకండ్లగుంట గ్రామాల రైతులు 847 బేళ్లు తీసుకురాగా 747 కొనుగోలయ్యాయి. అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.202.15 పలికింది.

టంగుటూరు వేలం కేంద్రానికి దావగూడూరు, చింతలపాలెం గ్రామాల రైతులు 879 బేళ్లు తీసుకురాగా 845 కొనుగోలయ్యాయి. గరిష్ఠ ధర కేజీ రూ.208, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.201.46 పలికింది.

ట్రాక్టర్‌తో ఢీకొట్టి మహిళ దారుణ హత్య

● కుటుంబ వివాదాల నేపథ్యంలోనే ఘటన
● పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి

టంగుటూరు: కుటుంబాల మధ్య వివాదం నేపథ్యంలో ఓ మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేసిన ఘటన టంగుటూరు మండలంలోని రావివారిపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సవలం సుధాకర్ భార్య హనుమాయమ్మ(48) అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అదే గ్రామానికి చెందిన సవలం కొండలరావు(బుజ్జి) హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుంటాడు. అతను వచ్చినప్పుడల్లా వారికి గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో హనుమాయమ్మ తన ఇంటి ముందు కూర్చుని మంచి నీరు తాగుతున్న సమయంలో కొండలరావు తన ట్రాక్టర్ నాగేలు అడ్డతో బలంగా ఢీకొట్టాడు. ఆమె కింద పడటంతో వెనుక టైరుతో తొక్కించగా తీవ్రగాయాలయ్యాయి. కొండలరావు సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. హత్యను అడ్డుకోబోయిన హనుమాయమ్మ కూతురు మాధురిని మహేష్, రమణమ్మ, ఆదిలక్ష్మమ్మ అనే వారు కొట్టారు. తీవ్రగాయాలైన హనుమాయమ్మను భర్త సుధాకర్ 108 వాహనంలో రిమ్స్‌కు తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గత కొన్ని నెలలుగా రెండు కుటుంబాల మధ్య వివాదం నేపథ్యంలో జరిగిన ఈ హత్యను రాజకీయాలతో ముడిపెట్టి టీడీపీ నేతలు ఆరోపణలు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడవులు అంతరిస్తే మానవ మనుగడకే ముప్పు


మొక్క నాటుతున్న డిప్యూటీ డైరెక్టర్ తదితరులు

● అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అపావు

పెద్దదోర్నాల: అడవులు అంతరించిపోతే పర్యావరణం తీవ్ర ప్రమాదంలో పడి మానవుల జీవితానికి ప్రమాదం ముంచుకొస్తుందని అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అపావు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దదోర్నాలలోని గణపతి చెక్‌పోస్టు వద్ద అవగాహన కార్యక్రమంలో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కల పెంపకమే శరణ్యమన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ప్రజలకు ఉపయోగపడేలా ఓ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రేంజి అధికారి విశ్వేశ్వరరావు, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ సజీవరావు, డీఆర్వోలు ఆరిఫ్‌ఖాన్, సోమసుందరం, సిబ్బంది పాల్గొన్నారు.

కంటైనర్ ఢీకొని వ్యక్తి మృతి


గ్రోత్ సెంటర్ వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో మరణించిన నల్లమద్ది కిషోర్(40)

మద్దిపాడు: మోటారుసైకిల్‌ను కంటైనర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. ఈ సంఘటన గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. హర్యానాకు చెందిన లారీ డ్రైవర్ శివశంకర్ ఫరీదాబాద్ నుంచి చెన్నైకి లోడ్ తీసుకెళ్తున్నాడు. నాగులుప్పలపాడు వైపు నుంచి బైక్‌పై రోడ్డు దాటుతున్న నల్లమద్ది కిషోర్(40)ను లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. కిషోర్ స్వగ్రామం జే.పంగులూరు మండలం బైటమంజులూరు. మృతుడు బ్యాంకుల ద్వారా హౌసింగ్ లోన్లు ఇప్పిస్తుంటాడని, ఈ నేపథ్యంలోనే నాగులుప్పలపాడు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్లడానికి రోడ్డు దాటుతున్నట్లు సమాచారం. మద్దిపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. లారీని సీజ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.